క్లుప్తంగా

ప్రతి అడుగు స్వచ్ఛత వైపు


ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతి ఒక్కరు స్వచ్ఛతవైపే అడుగు వేయాలని మున్సిపల్ కమిషన ర్ ఆశ్రిత్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక బీజేఆర్ చౌరస్తా ఆవరణలో శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. మార్నింగ్ వాకర్స్, వ్యాపారస్తు లు, ప్రజలు పాల్గొని హైదరాబాద్ రహదారికి రెండువైపులా ఉన్న గడ్డిని, చెత్తాచెదారం తొల గించారు. ఈ సందర్భంగా ఆశ్రిత్ కుమార్ మాట్లాడుతూ పట్టణ వాసులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్త ను బహిరంగ ప్రాంతాల్లో వేయకుండా చెత్త సేకరణ కార్మికులకు అందజేయాలని సూచించారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత: ప్రిన్సిపాల్


కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ రాజు తదితరులు

సిద్దిపేటఅర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు పిలుపునిచ్చారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్టాఫ్, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమస్యల నుంచి రక్షించుకోవాలంటే చెట్లు ఎంతో కీలకం అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామచందర్, హెచ్ఓడీలు పద్మావతి, శ్రీనివాస్, ఎల్ఎస్ రావు, పోచయ్య, డాక్టర్ మల్లేశం పీఆర్వో రఘు పాల్గొన్నారు.

ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంఈఓ కనకరాజు

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రతి విద్యార్థికి ఆధార్ బయో మెట్రిక్ తప్పకుండా చేయించాలని ఎంఈఓ గజ్జెల కనకరాజు చెప్పారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల వద్దే ఆధార్ అప్డేట్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఆధార్లో ఏమైనా పొరపాట్లు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అనిల్ కుమార్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శేఖర్, పెంటయ్య, సీఆర్పీలు రాజు, నగేశ్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు శ్రీప్రియ

గజ్వేల్‌రూరల్: మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అందులో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని హోమియో వైద్యురాలు శ్రీప్రియ అన్నారు. మండల పరిధిలోని శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన 'స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్'లో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, మాతృ వందన పథకం కింద మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. వైద్యసిబ్బంది, యోగా సాధకురాలు శ్రీప్రసన్నలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సిద్దిపేటఅర్బన్: తడ్కపల్లిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తడ్కపల్లి గ్రామంతోపాటు తడ్కపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్ ఏరియా, సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

మత్తడి దూకితే నీళ్లలో నుంచి వెళ్లాల్సిందే..
- పెరిగిన ప్రవాహంతో మట్టిరోడ్డు తెగే అవకాశం
- బతుకమ్మ నిమజ్జనానికి ఈదారే దిక్కు

గ్రామం మీదుగా రెండు వరుసలతో రింగు రోడ్డు మంజూరు కావడంతో సంతోషించిన ప్రజలకు అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెనతో ఇక్కట్లు తప్పడం లేదు.


ప్రవాహం నుంచి వెళ్తున్న గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): ఇటీవల కురిసిన వర్షాలకు ఊరచెరువు మత్తడి దూకి నీరు పారడంతో పాలమాకుల, ఓబులాపూర్, గోనెపల్లి గ్రామాలు ప్రజలు, రైతులు నెల రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నారు. ప్రవాహం పెరిగితే మట్టి రోడ్డు ధ్వంసం అవుతుందని, చెరువులో బతుకమ్మల నిమజ్జనం కోసం వెళ్లే మహిళలు, చిన్నారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పాలమాకుల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడు హైవేలు కలుపుతూ రింగ్ రోడ్డు

గత ప్రభుత్వం సిద్దిపేట చుట్టూ రింగ్‌రోడ్డు మంజూరు చేసింది. అందులో భాగంగా హైదరాబాద్ హైవే నుంచి వరంగల్ నేషనల్ హైవే రోడ్డుకు అనుసంధానం చేశారు. అక్కడి నుంచి చిన్నకోడూర్ మండలం ఓబులాపూర్, గోనెపల్లి, రామునిపట్ల వద్ద కరీంనగర్ వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. రామునిపట్ల నుంచి చిన్నకోడూర్ మీదుగా సిద్దిపేట రూరల్ మండలాల నుంచి కలెక్టరేట్ వరకు రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టారు.

విస్తరణ పనులు ఎప్పుడు?

రింగురోడ్డు పనులు అక్కడక్కడ మినహా 90 శాతం పనులు పూర్తయ్యాయి. బందారం, వెంకటాపూర్, పాలమాకుల, గోనెపల్లి, రామునిపట్ల గ్రామాల్లో ఇంటి నిర్మాణాలు ఉండడంతో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. అలాగే ఆయా గ్రామాల వద్ద కల్వర్టులు అసంపూర్తిగా వదిలివేయడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు ఆనుకొని చాల గ్రామాల్లో బ్రిడ్జి పనులు పూర్తి చేయాల్సి ఉంది.


నిలిచిపోయిన బ్రిడ్జి వద్ద స్థానిక నేతల ఆందోళన

అసౌకర్యంగా మారింది



ప్రజల సౌకర్యార్థం మాజీ మంత్రి హరీశ్‌రావు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ హైవేలను కలుపుతూ రింగురోడ్డు మంజూరు చేయించారు. ఐదేళ్ల కిందట ప్రారంభించిన రోడ్డు నేటికీ పూర్తి కాలేదు. అసంపూర్తి పనులతో గ్రామస్తులకు అసౌకర్యంగా మారింది.

– రాగుల సారయ్య, మాజీ ఎంపీపీ నంగునూరు

బతుకమ్మ నిమజ్జనానికి ఇబ్బందులు



పాలమాకుల వద్ద మూడు సంవత్సరాల కిందట బ్రిడ్జి నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలివేశారు. గ్రామం నుంచి ఓబులాపూర్, గోనెపల్లి గ్రామాలకు ఈదారి గుండానే వెళ్లాలి. ప్రస్తుతం చెరువు మత్తడి దూకుతున్నందున ప్రవాహం పెరిగితే మట్టి రోడ్డు కొట్టుకొనిపోయే ప్రమాదం ఉంది. బతుకమ్మ నిమజ్జనానికి ఇబ్బందులు తప్పేలా లేవు.

– వర్దోలు వేణుచక్రవర్తి, పాలమాకుల

ప్రభుత్వ మార్గదర్శకాలు తప్పనిసరి

- ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- కలెక్టర్ హైమావతి

దుబ్బాక: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో ప్రభుత్వ మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ హైమావతి సూచించారు. దుబ్బాకతోపాటు మండలంలోని రామక్కపేటలో శుక్రవారం ఆమె పర్యటించారు. క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎలాంటి సందేహాలున్నా అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. పీఎంఏవై యాప్‌లో అప్లోడ్ చేసిన ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం మండలపరిషత్‌తో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల తీరుతెన్నులపై సమీక్షించారు. ఇల్లు కట్టుకోని వారిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. అలాగే రామక్కపేట పీహెచ్‌సీని తనిఖీ చేశారు. స్వస్త్‌నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో చేస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు ఉంటుందని, మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా లచ్చపేటలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. సర్వే నిర్వహించి చదును చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్, ఎంపీఓ నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


రామక్కపేటలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

ఆస్పత్రి ప్రారంభానికి ఏర్పాట్లు చేయండి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్


ఆస్పత్రి గదులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రిని త్వరలో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆస్పత్రి భవనాన్ని శుక్రవారం సందర్శించి అన్ని గదులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పనులు పూర్తయ్యాయి కాబట్టి ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే మెయిన్ రోడ్డు నుంచి ఆస్పత్రి లోపల వరకు రోడ్డు వేయించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ నాగేందర్, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

మంత్రి పొన్నంకు గ్రామస్తుల కృతజ్ఞతలు

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ డీఈ విజయలక్ష్మి రామవరం చెరువు సుందరీకరణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, సింగిల్ విండో డైరెక్టర్ బూర్ర ప్రభాకర్ మాట్లాడారు. ఊరచెరువు కట్ట సుందరీకరణతోపాటు కట్టపై లైటింగ్ ఏర్పాటు, బతుకమ్మ ఘాట్ తదితర అభివృద్ధి పనులు గ్రామస్తుల కల అన్నారు. గత ప్రభుత్వం హయాంలో అనేకసార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే అధికారులను ఆదేశించి ప్రతిపాదనలు సిద్ధం చేయించడంపై గ్రామస్తులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఏఈలు శ్రీధర్, రమ్యశ్రీ, రిటైర్డ్ ఈఈ సుధాకర్‌రెడ్డి, నాయకులు కనకయ్య, శ్రీశైలం, లింగాల కనకయ్య, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

టీపీడీఈఏ సెక్రటరీ జనరల్ బీసీరెడ్డి



మాట్లాడుతున్న బీసీరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తామని తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ (టీపీడీఈఏ) సెక్రటరీ జనరల్ బీసీరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం టీపీడీఈఏ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రమేశ్, సలహాదారుడిగా వెంకటి, కార్యదర్శిగా మహ్మద్ సలేహ్ హుస్సేన్, కోశాధికారిగా వెంకటేశ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాజేంద్రప్రసాద్, రామకృష్ణ, ప్రశాంత్, ప్రీతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీసీరెడ్డి మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా టీపీడీఈఏ ఆధ్వర్యంలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయడంలో ముందుంటున్నామన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించడంలో టీపీడీఈఏ సభ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, నరేశ్‌కుమార్, మనోరంజన్‌రెడ్డి, తాజొద్దీన్‌బాబా, శ్రీనివాసరావు, రాజా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫారుఖ్ హుస్సేన్ పరామర్శ


పరామర్శిస్తున్న ఫారుఖ్

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని తిర్మలాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ యాదవరెడ్డి తండ్రి బాల్‌రెడ్డి ఇటీవల మరణించిన విషయం తెలుసుకుని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు చింతకింది మంజూర్ తదితరులు ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న ఎంఈఓ యాదవరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యతోనే ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ యాదవరెడ్డి అన్నారు. చిన్నకోడూరు జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యే వికాసాన్ని అందిస్తుందన్నారు. ప్రైవేట్ మోజులో పడి డబ్బులు వృథా చేయొద్దని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన వసతులు లభిస్తాయని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. ఈ సదర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేటఎడ్యుకేషన్: కంప్యూటర్ సైన్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత శుక్రవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ అక్టోబరు 24, 25న కళాశాలలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, ఐ.క్యూ. ఏ.సీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, పిట్ల దాసు పాల్గొన్నారు.

110 మంది ఉపాధ్యాయులకు సన్మానం


సత్కారం అందుకొన్న ఉపాధ్యాయులతో ఎంఈఓ సత్తయ్య తదితరులు

కొండపాక(గజ్వేల్): సమాజాభివృద్ధికి నిర్దేశకులు ఉపాధ్యాయులేనని ఎంఈఓ బచ్చలి సత్తయ్య, పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకుడు పాల్కంపల్లి నరేందర్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కుకునూరుపల్లి మండలంలో పనిచేస్తున్న సుమారు 110 మంది ఉపాధ్యాయులను దాతల సహకారంతో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో విలువైందన్నారు. ప్రభుత్వ పాఠశాలల కోసం తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకుడు పాల్కంపల్లి నరేందర్, మాజీ ఎంఎస్‌సీ చైర్మన్ మల్లం ఐలయ్య చెప్పారు. వేద పాఠశాల కరస్పాండెంట్ సంతోష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అజీమొద్దీన్, సీఆర్పీ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం కృషి

మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

కొండపాక(గజ్వేల్): రహదారుల నిర్మాణాలకు ప్రభుత్వం కృషిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లి నుంచి చిన్న కిష్టాపూర్ శివారులోని బీటీ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీటీ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. పనులు వేగవంతంగా జరిపించాలని కాంట్రాక్టరుకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నవీన్, రవీందర్, మహేందర్, ఉపేందర్, ఐలం, కిష్టారెడ్డి, యాదిగిరి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బాధితునికి పరామర్శ



సిద్దిపేటజోన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన చింతమడక గ్రామానికి చెందిన రాములును వంగ రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని సుశ్రుత ఆస్పత్రిలో శుక్రవారం బాధితుడిని కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

◆ సీసీ కెమెరాలపై అవగాహన అవసరం

చేర్యాల(సిద్దిపేట): పట్టణంతోపాటు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం సూచించారుర. వార్షిక తనిఖీల్లో భాగంగా చేర్యాల సీఐ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. సైబర్ నేరాలపై ప్రజలు, యువకులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. సీఐ శ్రీను, ఎస్ఐలు నవీన్, షేక్ మహబూబ్, ఏఎస్ఐ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ మోతాదు మించి యూరియా వాడొద్దు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు మోతాదు మించి యూరియా వాడొద్దని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు శ్రీదేవి, లతీఫ్ పాషా, డా.పల్లవి సూచించారు. అలిరాజ్‌పేటలో శుక్రవారం నిర్వహించిన «రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు» కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రత్యామ్నాయ పంటలు, చెట్ల పెంపకంపై అవగాహన కల్పించారు. ఏఓ వసంతరావు పాల్గొన్నారు.

◆ ఆత్మగౌరవం కోసం పోరాడుతాం

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆత్మగౌరవం కోసం ఎంత వరకైనా పోరాటాలు చేస్తామని మాజీ జెడ్పీటీసీ సభ్యులు మాలోతు భీలునాయక్, భూక్య శ్రీను నాయక్ అన్నారు. మండలంలో గిరిజన నాయకులు శుక్రవారం ఛలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే లంబాడీల ఆత్మీయ గౌరవసభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కొందరు చేస్తున్న కుట్రలను తిప్పికొడ్తామన్నారు. తిరుపతినాయక్, రాజునాయక్, రాంచందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇబ్బందులు కలిగించొద్దు: ఎస్ఐ మానస

దుబ్బాకటౌన్: వాహనదారులకు ఇబ్బందులు కలిగించొద్దని ఎస్ఐ మానస సూచించారు. రాయపోల్ మండల కేంద్రంలో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో కొన్ని రోజులగా వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మానస పంచాయతీ కార్యదర్శి శివకుమార్ సహకారంతో అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పడిన గుంతలను పూడ్చించారు.

తెలంగాణ సంస్కృతికి నెలవు బతుకమ్మ

కళాశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పువ్వులను సేకరించి విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు కలిసి భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు బతుకమ్మ అని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్, సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ అన్నారు. అదేవిధంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో బొడ్డెమ్మ వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా బొడ్డెమ్మలను అలంకరించి ఆడిపాడి అలరించారు.


గజ్వేల్‌రూరల్: డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థినులు, అధ్యాపకులు


సిద్దిపేటఎడ్యుకేషన్: బతుకమ్మను పేరుస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు



బొడ్డెమ్మల వద్ద ప్రిన్సిపాల్ సునీత తదితరులు


బెజ్జంకి ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఏపీఎం, సీసీ, వీఏఓలు

హరీశ్‌రావుకు ఆహ్వానం

సిద్దిపేటజోన్: రేణుక ఎల్లమ్మ తల్లి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని పట్టణ గీత సహకార సంఘం ప్రతినిధులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం లాల్ బహదూర్, కిష్టయ్యగౌడ్, ప్రకాశ్‌గౌడ్, బాల్‌కిషన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యంగౌడ్, సునీల్ గౌడ్ కలిసి మాట్లాడారు.


ఆహ్వాన పత్రిక అందుకుంటున్న హరీశ్‌రావు

మోటారు వాహన చట్టాన్ని సవరించాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి

సిద్దిపేటఅర్బన్: మోటారు వాహన చట్టాన్ని సవరించాలని, వాహన కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. కార్మిక, కర్షక భవన్‌లో శుక్రవారం నిర్వహించిన రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ 4వ మహాసభల్లో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి స్కీమ్ అమలు చేయడం వల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, వారికి ప్రతి నెల రూ.4,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎల్లయ్య, అధ్యక్షుడిగా మహ్మద్ షఫీ తదితరులు ఎన్నికయ్యారు.